తిరుపతమ్మ భక్తులకు వసతి కష్టాలు

- పది ఏసీ గదులు మాత్రమే అందుబాటులో..
- నాన్ ఏసీ గదుల్లో ఉండలేని పరిస్థితులు
- గదుల మరమ్మతులపై దృష్టి కరువు
- ఆరుబయటే వంటలు
- దాతల సహకారం కోరని అధికారులు


పది ఏసీ గదులున్న శ్రీతిరుపతమ్మ సదన్

పెనుగంచిప్రోలు: పెనుగంచిప్రోలు శ్రీతిరుపతమ్మవారి దర్శనానికి సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు కష్టాలు తప్పటం లేదు. అమ్మవారిని దర్శించుకుని సేద తీరేందుకు సరైన వసతి సౌకర్యాలు లేవు. వేసవి కాలం కావటంతో భక్తులు ఎక్కువగా ఏసీ గదులు ఆశ్రయిస్తున్నారు. పలు శుభకార్యాలు, సెలవు దినాలు కావటంతో ఏసీ గదులకు మంచి డిమాండ్ ఉంది. అవి అందుబాటులో లేక పోవటంతో నాన్ ఏసీ గదులు అద్దెకు తీసుకుని ఉక్కపోతతో అల్లాడుతున్నారు. ఏసీ గదులు భక్తుల అవసరాల మేరకు లేక పోవటంతో ఆలయ ఆదాయానికి గండి పడుతోంది. వీలైనన్ని ఏసీ గదులు పెంచటానికి ఆలయ అధికారులు చొరవ తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

ప్రైవేట్‌గా 100 ఏసీ గదులు..

మునేరు అవతల, ఆలయ పరిసరాల్లో మొత్తం 100 వరకు ఏసీ గదులు ప్రైవేటు వ్యక్తులవి అందుబాటులో ఉన్నాయి. దీంతో భక్తులు వాటిని అద్దెకు తీసుకోవటంతో ఆలయ ఆదాయానానికి గండి పడుతోంది.

ఆదాయం పెరుగుతున్నా..

ప్రతి ఏడాది సత్రాల నిర్వహణకు ప్రైవేటు వ్యక్తులకు కాంట్రాక్టుకు ఇవ్వటం ద్వారా ఆదాయం వస్తోంది. సత్రాల నిర్వహణకు గత ఏడాది జీఎస్టీతో కలుపుకుని ఆలయానికి రూ.48 లక్షల ఆదాయం వచ్చింది. ఈఏడాది జీఎస్టీతో కలుపుకుని రూ.58 లక్షల ఆదాయం వచ్చింది.

ఈ సమస్యలపై దృష్టి పెట్టాలి..

ఏడాదికేడాది ఆదాయం పెరుగుతున్నా ఆలయ అధికారులు మాత్రం భక్తుల సౌకర్యాల విషయం పట్టించుకోవటం లేదని భక్తులు ఆరోపిస్తున్నారు. దాతల సాయంతో అయినా ఏసీ గదులు పెంచాలని భక్తులు కోరుతున్నారు. సత్రాల గదులు మరమ్మతులకు గురైనా పట్టించుకోవటం లేదని, తక్షణం వాటిపై దృష్టి పెట్టాలని భక్తులు కోరుతున్నారు. శ్రీతిరుపతమ్మ సదన్‌లో గదుల ముందు వంటలు చేస్తుండటంతో గదుల్లో ఉండలేక భక్తులు అల్లాడి పోతున్నారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని భక్తులు అంటున్నారు.


ఆరుబయట వంటలు చేస్తూ ఇబ్బందులు పడుతున్న భక్తులు

పది ఏసీ గదులే అందుబాటులో..

గతంలో మొదటగా నిర్మించిన గోపయ్య సదన్‌లో 17 గదులు మాత్రమే భక్తులకు అందుబాటులో ఉన్నాయి. దానిలో మొదటి అంతస్తులో 8 గదులు ఆలయ ఈఓ, సిబ్బంది కార్యాలయాలుగా వాడుతున్నారు. తరువాత నిర్మించిన శ్రీతిరుపతమ్మ సదన్‌లో మొత్తం 68 గదులు ఉండగా వాటిలో 10 మాత్రమే ఏసీ గదులు ఉన్నాయి. వాటినే భక్తులకు అద్దెకు ఇస్తున్నారు. వాటిలో కూడా నాయకులు, అధికారులు ఎప్పుడు బుక్ చేస్తారో తెలియదు. ఏసీ గదులకు 24 గంటలకు రూ.1500, నాన్ ఏసీ గదులకు రూ.500 నుంచి రూ.800 వసూలు చేస్తున్నారు. శుక్ర, ఆదివారాల్లో గదులు దొరికే పరిస్థితి లేదు. అందరూ ఏసీ గదులు అందుబాటులో లేక పోవటంతో నాన్ ఏసీ గదులు, మున్నేరు అవతల మామిడి తోటల్లో సేద తీరుతున్నారు.

ఉక్కపోతకు ఉండలేక పోతున్నాం



ఆలయ సత్రాల్లో ఏసీ గదులు అందుబాటులో లేక పోవటంతో ఆలయం దగ్గరగా ఉండాలని నాన్ ఏసీ గదులు అద్దెకు తీసుకున్నాం. ఉక్కపోతను భరించలేక పోయాం. ఆలయ అవసరాల దృష్ట్యా ఏసీ గదులు పెంచాల్సిన అవసరం ఉంది. గదుల్లో కూడా సరైన సౌకర్యాల లేవు.

– గాయత్రి, భక్తురాలు, మధిర

మరమ్మతులు చేయిస్తున్నాం..



ప్రస్తుతం సత్రాల గదుల మరమ్మతులు జరుగుతున్నాయి. కొద్ది రోజుల్లో మరమ్మతులు పూర్తి చేస్తాం. ఏసీ గదులు పెంచటానికి తీర్మానించాం. ప్రస్తుతం ఐదు గదులను ఏసీ గదులుగా మారుస్తున్నాం. త్వరలో మరిన్ని పెంచేందుకు చర్యలు తీసుకుంటాం. దాతల సాయంలో మరిన్ని ఏసీ గదులు ఏర్పాటు చేస్తాం.

– ఎల్.రమ, ఆలయ ఈఈ



గోపయ్య సదన్‌లో అధికారులు వినియోగిస్తున్న మొదటి అంతస్తు

క్లుప్తంగా

మజ్జిగ పంపిణీ



నందిగామ టౌన్: సత్యదివ్యాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో దాతల సహకారంతో ప్రజలకు ప్రతిరోజూ మజ్జిగ పంపిణీ చేయటం సంతోషంగా ఉందని సమితి నిర్వాహకుడు కోటి సూర్యం పేర్కొన్నారు. పట్టణంలోని మెయిన్ బజార్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రంలో మంగళవారం మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చందర్లపాడు మండలం చింతలపాడు గ్రామానికి చెందిన వలిబోయిన బాలాజీ లక్ష్మి సహకారంతో వెయ్యి మందికి మజ్జిగ పంపిణీ చేయగా, జగ్గయ్యపేట జ్యూయలరీ సహకారంతో తాగు నీటిని పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నిర్వాహకులు పాల్గొన్నారు.

బంగారు కుటుంబం సర్వే పరిశీలన



తక్కెళ్లపాడు(జగ్గయ్యపేట): గ్రామంలో బంగారు కుటుంబంపై మంగళవారం సర్వే చేశారు. సర్వేను ఎంపీడీవో నితిన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిరుపేదలను గుర్తించే కార్యక్రమంలో భాగంగా బంగారు కుటుంబం పేరుతో సర్వే నిర్వహించేందుకు గ్రామాన్ని ఎంపిక చేసినట్లు తెలిపారు. సర్వేలో 112 మంది నిరుపేద కుటుంబాలను గుర్తించామని చెప్పారు. ఈ మేరకు జిల్లా అధికారులకు నివేదిక అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ పద్మావతి, కార్యదర్శి చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా కేంద్రియ విద్యాలయ భవనం పనులు



నూజివీడు: రెవెన్యూ డివిజన్ కేంద్రమైన నూజివీడుకు మంజూరైన కేంద్రియ విద్యాలయం ఏర్పాటుకు ఉద్దేశించిన తాత్కాలిక భవనం సిద్ధమవుతోంది. రెండు రోజులుగా భవనానికి రంగులు వేసే పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

గత ప్రభుత్వంలో మంజూరు..

పట్టణంలోని ఎంప్లాయీస్ కాలనీలో ఉన్న పాఠశాల భవనం ఆవరణలో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు కృషితో అదనంగా పలు తరగతి గదులను నిర్మించి కేంద్రియ విద్యాలయం మంజూరు కోసం ప్రతిపాదనలు పంపగా కేంద్ర ప్రభుత్వం విద్యాలయాన్ని మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో కేంద్రియ విద్యాలయ సమితి ఉన్నతాధికారులు భవనంలో అన్ని మైనర్ పనులను పూర్తి చేసి తమకు అప్పగించాలని జిల్లా కలెక్టర్‌ను కోరగా, పట్టణంలోని వైఎస్సార్ సీపీకి చెందిన కౌన్సిలర్లు, నాయకులు అధికారుల నిర్లక్ష్యాన్ని కలెక్టర్ వెట్రిసెల్వి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు మున్సిపల్ అధికారులు శరవేగంగా పనులు చేయిస్తున్నారు. భవనాన్ని సాధ్యమైనంత త్వరగా అప్పగిస్తే ఈ విద్యాసంవత్సరం నుంచే తరగతులు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని పలుమార్లు కేంద్రియ విద్యాలయ సమితి అధికారులు పేర్కొన్నారు.

ముందస్తు జాగ్రత్తలతో ప్రమాదాల నివారణ



నూజివీడు: ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా గృహాల్లో అగ్నిప్రమాదాలను నియంత్రించవచ్చని నూజివీడు అగ్నిమాపక కేంద్రం ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ డి. మత్తయ్య అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని బస్టాండ్, డీమార్టు, ద్వారకా థియేటర్ వద్ద అగ్నిప్రమాదాలు సంభవించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తదితర అంశాలపై ప్రజలకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వంట గదిలో అన్ని వైపుల నుంచి వెలుతురు, గాలి వచ్చేటట్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. పాడైపోయిన గ్యాస్ ట్యూబ్‌లను వాడకూడదని, ఐఎస్ఐ మార్కు ఉన్న ట్యూబ్‌లనే ఉపయోగించాలని చెప్పారు. వంట చేయడం పూర్తయిన వెంటనే రెగ్యులేటర్ వద్ద ఆఫ్ చేయాలన్నారు. వంటగదిలో కిరోసిన్, డీజిల్, పెట్రోల్, అదనపు గ్యాస్ సిలిండర్‌లను ఉంచకూడదని చెప్పారు. దుస్తులకు నిప్పు అంటుకున్నప్పుడు కంగారుపడి ఏమాత్రం పరిగెత్తకూడదని, నేలపై పడుకుని దొర్లాలన్నారు. ఎక్కువ రోజులు సెలవులపై బయటకు వెళ్తున్నప్పుడు ఎలక్ట్రికల్ మెయిన్‌ను ఆఫ్ చేయాలి. ప్రతి గృహంలో కార్బన్‌డైయాక్సైడ్ సిలిండర్‌ను ఉంచుకోవాలన్నారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటు



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలో ఐదవ వార్డు వేపలవాగు బ్రిడ్జి వద్ద మంగళవారం నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులను చేపట్టారు. నిత్యం ట్రాఫిక్ ఎక్కువగా ఉండే ఈ మార్గంలో విద్యుత్ వైర్లు కిందికి వేలాడి ప్రమాదకరంగా ఉన్నాయి. విద్యుత్ స్తంభాన్ని తొలగించి, కొత్త వాటిని ఏర్పాటు చేయాలని ఆ వార్డు కౌన్సిలర్, పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వట్టెం మనోహర్ విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన వారు కొత్త స్తంభాలను ఏర్పాటు, వైర్లు ఎత్తులో ఉండే విధంగా ఏర్పాటు చేశారు. ఎంతో కాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యను వెంటనే పరిష్కరించిన సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు. పట్టణంలో ఇదే విధంగా ప్రమాదకరంగా ఉన్న స్తంభాలను తొలగించి వాటి స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

డైరీ పార్లర్‌లో చోరీ

ఆగిరిపల్లి: స్థానిక బ్రాహ్మణ వీధిలో దేశిబోయిన శ్రీనివాసరావుకు చెందిన డైరీ పార్లర్‌లో సోమవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. గుర్తుతెలియని వ్యక్తులు దుకాణం షట్టర్ తాళాలు పగలగొట్టి రూ.7 వేల నగదు, కొంత సామాగ్రిని చోరీ చేశారని షాపు యజమాని తెలిపారు. రోడ్డుపై ఉన్న సీసీ కెమేరాలను పరిశీలించగా నలుగురు వ్యక్తులు బైక్‌లపై వచ్చి ఈ చోరీకి పాల్పడినట్లు తెలిసిందన్నారు. షాపు యజమాని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చిరుధాన్యాలతో మంచి ఆరోగ్యం


మున్నలూరులో బాలింతతో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ కరీమాబీ, వర్కర్లు


అవగాహన కల్పిస్తున్న ఏసీడీపీఓ నాగమణి, అంగన్‌వాడీ కార్యకర్తలు

పెనుగంచిప్రోలు: చిరు ధాన్యాలతో చేసిన ఆహారం తీసుకోవటం వలన మంచి ఆరోగ్యం లభిస్తుందని ఏసీడీపీఓ నాగమణి అన్నారు. పోషకాహార పక్షోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు 1000 రోజుల సంరక్షణపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషక విలువలు కలిగిన ఆహారం లభిస్తుందన్నారు. పోషణ్ ట్రాకర్ యాప్‌లో తమకు తామే కుటుంబాలు నమోదు చేసుకునే విధానం వివరించారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సువర్చల, నాగమణి, విమల, జయలక్ష్మి, రాజ్యలక్ష్మి, కల్పన, భవాని, ఝాన్సీ, మంజుల, తదితరులు పాల్గొన్నారు.

కంచికచర్ల: మండలంలోని మున్నలూరు, కొత్త పెండ్యాల గ్రామాల్లో పోషణ్ పక్వాడా పక్షోత్సవాల సందర్భంగా గర్భిణులు, బాలింతలకు మంగళవారం అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షేక్ కరీమాబీ మాట్లాడుతూ చిన్న పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవటంతో పాటు వారి బరువును ఎప్పటికప్పుడు పరిశీలించుకోవాలన్నారు. ఆరోగ్యకరమైన జీవనశైలి, ఊబకాయం ఉన్న పిల్లల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియపర్చారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఎస్. వేణు, జీ రాణి పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం తప్పనిసరి

నూజివీడు: గర్భిణులు, బాలింతలు, చిన్నారులు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని నూజివీడు ఇన్‌చార్జి సీడీపీఓ కె. ధనలక్ష్మి అన్నారు. స్థానిక గొడుగువారిగూడెంలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషణ్ పక్వాడా పక్షోత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఆకుకూరలు, పాలు, పండ్లు, కోడిగుడ్లు, చిరు ధాన్యాలను ప్రతి రోజూ తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందజేస్తున్న బాలామృతం ఎంతో మేలు చేస్తుందని చెప్పారు. పిల్లల తల్లులకు ఇచ్చిన గ్రోత్ కార్డుల్లో పిల్లల బరువు, ఎత్తు తనిఖీ చేయించి వారి ఎత్తు, బరువు పెరిగేలా చూడాలన్నారు. గర్భిణులు పోషకాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యవంతమైన బిడ్డకు జన్మనిస్తారని చెప్పారు.

చలివేంద్రం ప్రారంభం

మైలవరం: మైలవరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎక్సైజ్ సీఐ జోస్యుల శ్రీనివాస్ మంగళవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వేసవిలో బాటసారుల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. సిబ్బంది పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలి

విస్సన్నపేట: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా అధ్యక్షుడు వి. నాగరాజు ప్రభుత్వాన్ని కోరారు. వేమిరెడ్డిపల్లి పంచాయతీ పరిధిలోని సత్తెన్నగూడెంలో ఉపాధి హామీ పథకం కూలీల సమస్యలను మంగళవారం ఆయన అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ 12 వారాలుగా ఉపాధి కూలీలకు వేతన బకాయిలు పెండింగ్‌లో ఉంచడం తగదన్నారు. మండలంలో సుమారు రూ.4 కోట్ల మేర వేతనాలు రావలసి ఉందని చెప్పారు.

వడ్డీ రాయితీ సద్వినియోగం చేసుకోండి

తిరువూరు: గత ఆర్థిక సంవత్సరంలో ఆస్తి పన్ను, ఖాళీ స్థలాల పన్నుల బకాయిలపై విధించిన వడ్డీపై రాయితీ ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని తిరువూరు నగర పంచాయతీ కమిషనర్ లోవరాజు తెలిపారు. 2025–26 ఆర్థిక సంవత్సరంలో పన్ను చెల్లింపునకు సైతం 5 శాతం రాయితీ కల్పించినందున ఈ నెల 30వ తేదీ లోగా చెల్లించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి


ధాన్యాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్, ఏవో, తదితరులు

నందిగామ రూరల్: పంటలను ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలలో విక్రయించి గిట్టుబాటు ధర పొందాలని తహసీల్దార్ సురేష్ బాబు పేర్కొన్నారు. మండలంలోని మాగల్లు, కొండూరు గ్రామాల రైతు సేవా కేంద్రాలలోని ధాన్యం నిల్వలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 17 శాతం కన్నా తక్కువ తేమ ఉన్న ధాన్యాన్ని రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలన్నారు. గ్రేడ్- ఎ రకం ధాన్యానికి క్వింటాకు రూ.2,320 కాగా సాధారణ రకం ధాన్యానికి రూ.2,300లుగా ప్రభుత్వం మద్దతు ధర కల్పిస్తోందన్నారు. దళారులను ఆశ్రయించి తక్కువ ధరకు ధాన్యాన్ని విక్రయించి నష్టపోవద్దని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవో ఖాశీం, సచివాలయ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

ఇదేనా స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణ ఆంధ్ర


అడవిరావులపాడు గ్రామ ఎంట్రన్స్‌లో రోడ్డు పక్కన చెత్తకుప్పలు

నందిగామ రూరల్: మండలంలోని మెజార్టీ గ్రామాలు చెత్త, ఎరువు కుప్పలతోనే స్వాగతం పలుకుతున్నాయి. అధికారులు.. ప్రజా ప్రతినిధులు పారిశుద్ధ్య చర్యలు తీసుకోకపోవటంతో గ్రామీణ ప్రాంతాలు చెత్త కుప్పలతోనే దర్శనమిస్తున్నాయి. మండలంలోని అడవిరావులపాడు, పల్లగిరి, మాగల్లు, తదితర గ్రామాలలో మాత్రం చెత్త, పేడ దిబ్బలు, వ్యర్థాల కుప్పలే స్వాగతం పలుకుతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

ముక్కు మూసుకోవాల్సిందే..

గ్రామాల్లో చెత్త, పేడ దిబ్బలు, ఎరువు కుప్పలు రోజుల తరబడి నిల్వ ఉండటంతో దుర్గంధం వెదజల్లుతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు పేర్కొంటున్నారు. వర్షాలు పడిన సమయంలో పేడ, చెత్త కుప్పలు మరింత అధ్వానంగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెత్త కుప్పలు కుళ్లి దోమల ఆవాస కేంద్రాలుగా మారుతున్నాయి. దోమల భారిన పడి అనారోగ్యంతో ఆస్పత్రి పాలు కావాల్సి వస్తుందేమోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

స్పందించని అధికారులు..

గ్రామాల్లో పేడ, చెత్త కుప్పలను తొలగించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతున్నా ఫలితం లేకపోతుందని ప్రజలు వాపోతున్నారు. ఆర్అండ్‌బీ, పంచాయతీ రాజ్ రహదారుల వెంబడి చెత్త కుప్పలు వేస్తున్నా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పారిశుద్ధ్య చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ప్రతి నెలా మూడో శనివారం నిర్వహించే 'స్వచ్ఛ' కార్యక్రమం ఎంత చిత్తశుద్ధితో చేస్తున్నారో చెప్పేందుకు ఈ చెత్తకుప్పలే నిదర్శనమని ఆయా గ్రామాల ప్రజలు విమర్శిస్తున్నారు.

అన్న క్యాంటీన్ స్థలం ఆక్రమణకు యత్నాలు

తిరువూరు: పాత బస్టాండు సెంటర్‌లోని అన్న క్యాంటీన్ స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రైవేటు వ్యక్తులు మంగళవారం యత్నించారు. క్యాంటీన్ భవనానికి దక్షిణం వైపున పాత ప్రహరీని తొలగించి నాలుగు అడుగులకు పైగా ఆక్రమించి కొత్త గోడ నిర్మించేందుకు పనులు చేపట్టగా స్థానికులు నగర పంచాయతీ కమిషనర్ లోవరాజుకు ఫిర్యాదు చేశారు. ప్రహరీ నిర్మాణ పనులను నిలిపి వేయాల ని కమిషనర్ ఆదేశించారు. టౌన్ ప్లానింగ్ సిబ్బంది స్థలాన్ని పరిశీలించి సరిహద్దులు నిర్ధారించారు. గతంలో కూడా క్యాంటీన్ వెనుక వైపు స్థలం ఆక్రమణకు గురైందని స్థానికులు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.

నేడు గదులు, ముఖద్వారం ప్రారంభోత్సవం


ప్రారంభానికి సిద్ధంగా ఆలయ ముఖ ద్వారం

వీరులపాడు: మండలంలోని జుజ్జూరు గ్రామంలో వేంచేసియున్న పార్వతీ సమేత సోమేశ్వర స్వామి వారి ఆలయంలో దాతల సహకారంతో నూతనంగా నిర్మించిన కార్యాలయపు గదులు, యాగశాల ఆలయ ముఖద్వారం బుధవారం ఉదయం ఎనిమిది గంటలకు ప్రారంభోత్సవ సంప్రోక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకుడు యనమదల ప్రసాద్‌శర్మ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో ఉదయం గణపతి పూజ, పుణ్యాహవచన, త్రిశూల పూజ, వాస్తు పూజ, గణపతి హోమం, లక్ష్మీగణపతి హోమంతో పాటు పలు ప్రత్యేక పూజలు జరుగుతాయని చెప్పారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అగ్ని ప్రమాదాల్లో అప్రమత్తత అవసరం

కంచికచర్ల: అగ్ని ప్రమాదాలపై ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటిస్తూ అవగాహన కలిగి ఉండాలని ఫైర్ అధికారి తలశిల శ్రీనివాసరావు పేర్కొన్నారు. కంచికచర్ల సినిమా హాల్, హోటల్ ఆల్ఫా, ఆర్టీసీ బస్టాండ్ వద్ద మంగళవారం అగ్ని ప్రమాదాలు జరిగితే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కర పత్రాలను పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో ఎక్కువగా అగ్ని ప్రమాదాలు జరుగుతాయని, గ్యాస్ సిలిండర్ వెలిగించే సమయంలో తడిలేకుండా చూడాలన్నారు. వంట గదిలో గ్యాస్ లీకయితే ముందుగా కిటికీలు తెరిచి ఉంచాలన్నారు. వేసవి కాలంలో వరిగడ్డికి ఆకతాయిలు నిప్పంటించే ప్రమాదం ఉందని, పశుపోషకులు పలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బయట వ్యక్తులు ఆ ప్రాంతంలో సంచరిస్తే పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. బస్సులో అగ్నిప్రమాదం జరిగితే కిటికీల ద్వారా బయటకు రావాలని ప్రయాణికులకు సూచించారు. అంతస్తు భవనంలో మంటలు చెలరేగినప్పుడు కిటికీలను బద్దలు కొట్టి లోపల ఉన్న వ్యక్తులను వెనుకవైపు నుంచి కాపాడవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది బీకే ప్రవీణ్‌కుమార్, కే జయరాం, జీ శేఖర్‌బాబు, ఎం.శ్రీనివాసరావు, ఎస్కే తాజుద్దీన్, ఎం.అశోక్, బీ సంజీవ్ వర్మ, షేక్ సుభానీ, శ్రీనివాసరావు, సుభానీ, జీ జీవన్, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వేంకటేశ్వరుని వసంతోత్సవం


చక్రతీర్థం నిర్వహిస్తున్న అర్చకులు


కోనేరులో స్వామి వారికి చక్రస్నానం చేయిస్తున్న అర్చకులు

తిరుమలగిరి(జగ్గయ్యపేట): ప్రముఖ పుణ్యక్షేత్రం వాల్మీకోద్భవ వెంకటేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా ఐదవ రోజు మంగళవారం స్వామి వారికి వసంతోత్సవం, చక్రతీర్థం, కలశ స్నపనం, మహానివేదనం, పూర్ణాహుతి, ధ్వజారోహణ కార్యక్రమాలను ఉత్సాహంగా నిర్వహించారు. ప్రధానార్చకుడు తిరునగరి రామకృష్ణమాచార్యులు, పరాంకుశం వాసుదేవాచార్యుల పర్యవేక్షణలో ఉత్సవమూర్తులను కొండపై నుంచి ప్రత్యేక రథంలో ఊరేగింపుగా తీసుకువచ్చి కొండ కింద ఉన్న స్వామి వారి కోనేరులో ప్రత్యేక పూజల అనంతరం వసంతోత్సవం నిర్వహించారు. భక్తులు, అర్చకులు రంగులు చల్లుకుంటూ చక్రతీర్థం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏసీ ప్రసాద్, సిబ్బంది రుక్మందరావు, వెంకటేశ్వరరావు, శోభనాద్రి, రామకృష్ణ, అర్చకులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించండి


నందిగామ మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు

నందిగామ రూరల్: మున్సిపల్ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, రూ.26 వేలు కనీస వేతనం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కటారపు గోపాల్ పేర్కొన్నారు. మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించటంతో ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తోందన్నారు. మున్సిపల్ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. ఉద్యోగ విరమణ పొందిన వారి స్థానంలో వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగం, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని తెలిపారు. ప్రభుత్వం స్పందించి కార్మికుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు సలికేటి నరేష్, మాణిక్యం, నాగరాజు, సతీష్, రూతమ్మ, పలువురు కార్మికులు పాల్గొన్నారు.